# అంతరాయం.. నిరంతరం



## గంట గడిచినా.. విద్యుత్ పునరుద్ధరణ ఉండట్లే

**క్షేత్ర స్థాయిలో కొరవడిన ఉన్నతాధికారుల పర్యవేక్షణ**

**మరమ్మతుల్లో విద్యుత్ సిబ్బంది తీవ్ర నిర్లక్ష్యం**

**తరచూ అంతరాయాలతో జనం అవస్థలు**

సిటీబ్యూరో, ఫిబ్రవరి 18 (నమస్తే తెలంగాణ): కరెంటు పోయిందా.. ఇక అంతే సంగతులు.. ఎప్పుడు వస్తుందోనని వేచిచూడాల్సిందే. గంట గడిచినా.. పునరుద్ధరణ ఉండటం లేదు. గ్రేటర్‌లో విద్యుత్ సరఫరా వ్యవస్థ ప్రస్తుత తీరిది. అధికారికంగా ఎలాంటి కరెంటు కోతలు లేకపోయినా..సబ్ స్టేషన్లలో నిరంతరం నాణ్యమైన విద్యుత్ ఉన్నా... క్షేత్ర స్థాయిలో అంతరాయాలు నిత్యకృత్యం అన్నట్లు మారాయి. ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి ఇండ్లకు వెళ్తున్న లైన్లలోనే ఉత్పన్నమవుతున్న సమస్యను పరిష్కరించడంలో అధికారులు తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారు. స్థానికంగా ఆకస్మాతుగా సరఫరా నిలిచిపోతే దాని పునరుద్ధరించేందుకు సిబ్బంది గంటల తరబడి సమయం తీసుకుంటున్నారన్న ఆరోపణలు ఎక్కువయ్యాయి. కరెంటు సరఫరా నిలిచిపోయిందని అనేకసార్లు ఫోన్లు చేస్తే తప్ప.. క్షేత్రస్థాయిలోని సిబ్బంది స్పందించడం లేదని నగరంలోని పలు కాలనీ వాసులు వాపోతున్నారు. అసలే వేసవి కాలం కావడంతో ఈ సమస్యను గ్రేటర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ వినియోగదారులు ప్రతి రోజూ ఎక్కడో ఒక చోట ఎదుర్కొంటున్నారు. నిరంతరం నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తున్నామని చెబుతున్నారే తప్ప.. అలాంటి పరిస్థితి క్షేత్ర స్థాయిలో ఉండటం లేదని, కరెంటు పోవడం, రావడం షరా మామూలై పోయిందని విద్యుత్ వినియోగదారులు పేర్కొంటున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల దగ్గర ఫ్యూజ్ పోతే దాన్ని సరిచేసేందుకు 10-15 నిమిషాలు పడితే, ఎమర్జెన్సీ బృందాలు రావడానికి మాత్రం గంటకు పైనే పడుతోందని ఫిర్యాదుదారులు వాపోతున్నారు.

### గ్రేటర్‌లో 9 సర్కిళ్లు..

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో నిరంతర నాణ్యమైన విద్యుత్ సరఫరాను అందించేందుకు మొత్తం 9 సర్కిళ్లను, వాటి పరిధిలో డివిజన్స్, సబ్ డివిజన్, సెక్షన్ కార్యాలయాలను ఏర్పాటు చేశారు. ప్రతి సెక్షన్ పరిధిలో క్షేత్ర స్థాయిలో లైన్ ఇన్‌స్పెక్టర్లతో పాటు లైన్‌మెన్‌లు, వారికి సహాయకులుగా హెల్పర్లు (ఆర్టిజన్స్) విధుల్లో ఉంటున్నా.. విద్యుత్ అంతరాయం విషయంలో తలెత్తున్న సమస్యలపై అధికార యంత్రాంగం పూర్తి స్థాయిలో దృష్టి సారించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా కొత్త కనెక్షన్లు ఇవ్వడంలో చూపుతున్న ఆసక్తిని విద్యుత్ సరఫరా విషయంలో జరుగుతున్న అంతరాయంపై సెక్షన్ అధికారులు చూపడం లేదు. కాలనీల్లో ఆకస్మాతుగా కరెంటు పోతే పునరుద్ధరించేందుకు వినియోగదారులు సెక్షన్ కార్యాలయానికి ఫోన్ చేస్తే ఎమర్జెన్సీ బృందాలకు ఫోన్ చేయాలని ఉన్నతాధికారులు చెబుతున్నారు. సమస్యను ఎమర్జెన్సీ బృందాలకు చెబితే తాము వేరే ఫిర్యాదు వస్తే దాన్ని సరిచేసి వస్తామని, సమయం పడుతుందంటూ ఫోన్ పెట్టేస్తున్నారు. ప్రతి సెక్షన్ పరిధిలో ఉండే లైన్ ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మెన్‌లు, వారికి సహాయకులుగా ఉండే హెల్పర్లు విధుల్లో ఉంటున్నా వారు మాత్రం సమస్యను పరిష్కరించేందుకు ముందుకు రావడం లేదని వినియోగదారులు ఆరోపిస్తున్నారు.


# బల్దియా బడ్జెట్ రూ.8,437 కోట్లు

- రెండు కేటగిరీలుగా పద్దు
- ఏ కేటగిరీలో రూ. 7,937 కోట్లు
- బీ కేటగిరీలో రూ. 500కోట్లు
- గతేడాది కంటే రూ.2,213కోట్లు అదనం
- నేడు కౌన్సిల్‌లో చర్చ..
- ఆమోదించనున్న సభ్యులు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 18 (నమస్తే తెలంగాణ): జీహెచ్‌ఎంసీ 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బడ్జెట్ ముసాయిదాను సోమవారం మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన జరిగే కౌన్సిల్ సమావేశంలో ప్రవేశపెట్టనున్నారు. 2023-24 సంవత్సరానికి బడ్జెట్ రూ. 6,224 కోట్లుగా ప్రతిపాదించగా, రాబోయే ఆర్థిక సంవత్సరానికి అధికారులు రూ. 8437 కోట్లుగా ఖరారు చేశారు. మారిన అవసరాలు, పెరిగిన ఖర్చులు వంటివి దృష్టిలో ఉంచుకొని గతేడాది కంటే ఈ సారిగా అదనంగా రూ. 2,213 కోట్ల పద్దును పెంచారు. గతంలో మాదిరిగానే బడ్జెట్‌ను రెండు భాగాలుగా (ఏ,బీ) రూపొందించారు. ఈ సారి కూడా హెచ్‌ఎంసీది ఏ విభాగం కింద ఉండగా, డబుల్‌బెడ్రూం ఇండ్ల కోసం అందే నిధులను 'బి' కేటగిరీగా చేర్చారు. ఏ కేటగిరీలో రూ.7,937కోట్లు, బీ కేటగిరీలో డబుల్ బెడ్రూం ఇండ్లకు రూ. 500కోట్లు కేటాయించారు. కాగా, కౌన్సిల్‌లో ఈ బడ్జెట్ ప్రతిపాదనపై సభ్యులు విస్తృతంగా చర్చించనున్నారు. ఆ తర్వాత కౌన్సిల్ సభ్యులు ఆమోదించిన తర్వాత అధికారులు ఈ బడ్జెట్ ప్రతిపాదనను ప్రభుత్వానికి అందజేసి అనుమతి తీసుకుంటారు.

**జీహెచ్‌ఎంసీ బడ్జెట్ (రూ.కోట్లు)**

| హెడ్ ఆఫ్ అకౌంట్ | 2023-24 ఆర్థిక సంవత్సరం | 2024-25 ఆర్థిక సంవత్సరం |
|---|---|---|
| రెవెన్యూ ఆదాయం | 3,967 | 5,938 |
| రెవెన్యూ వ్యయం | 2,667 | 3,458 |
| రెవెన్యూ మిగులు | 1,300 | 2,480 |
| క్యాపిటల్ నిధులు | 3,557 | 4,479 |
| క్యాపిటల్ వ్యయం | 3,557 | 4,479 |



బొంరాస్‌పేట ఎంఆర్‌సీలో ఏర్పాటు చేసిన కంప్యూటర్లు

# ఎంఆర్‌సీలకు కంప్యూటర్లు

- జిల్లాలోని 19 ఎంఆర్‌సీలకు పంపిణీ చేసిన ప్రభుత్వం
- ఆన్‌లైన్ నివేదికలు పంపడానికి, డాటా ఎంట్రీ చేయడానికి అవకాశం

బొంరాస్‌పేట, ఫిబ్రవరి 18 : ప్రభుత్వ కార్యాలయాల్లో కంపూటర్ల వినియోగం పెరిగిపోయింది. ఆఫ్‌లైన్ పనుల కంటే ఆన్‌లైన్ పనులకు ఎక్కువగా ప్రాధాన్యం పెరుగుతున్నది. ప్రభుత్వ శాఖల్లో జరిగే వివిధ కార్యకలాపాలు, అభివృద్ధి పనులు, నిధుల వినియోగం తదితర విషయాలను కంప్యూటర్లలో నిక్షిప్తం చేస్తున్నారు. ప్రభుత్వం జారీ చేసే ఉత్తర్వులను ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకుని, జిల్లా అధికారులకు పంపే నివేదికలను కూడా ఆన్‌లైన్‌లో మండల అధికారులు పంపుతున్నారు. విద్యాశాఖలో కూడా కంప్యూటర్ల వినియోగం బాగా పెరిగింది. మండలంలోని అన్ని పాఠశాలల వివరాలు, విద్యార్థుల వివరాలు, పాఠశాలలకు మంజూరవుతున్న నిధులు, ఖర్చు చేసిన వివరాలు, చైల్డ్ ఇన్ఫోలో విద్యార్థుల వివరాల నమోదు, యూడైస్‌లో పాఠశాలల వివరాల నమోదు తదితర ఎన్నో వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. మండలస్థాయిలో విద్యాశాఖకు మండల విద్యా వనరుల కేంద్రాలు(ఎంఆర్‌సీ) ఉన్నాయి. వీటిలో చాలా ఏండ్ల నుంచి ఒక్కొక్క కంప్యూటరే ఉంది. దీంతో ఆన్‌లైన్‌లో వివరాలను నమోదు చేయడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని గుర్తించిన ప్రభుత్వం ఎంఆర్‌సీలకు కంప్యూటర్లను సరఫరా చేసింది. ఒక్కో ఎంఆర్‌సీకి 6 కంప్యూటర్ల చొప్పున జిల్లాలోని 19 ఎంఆర్‌సీలకు కంప్యూటర్లను ప్రభుత్వం సరఫరా చేసింది. దీంతో ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నివేదికలు పంపించడానికి, విద్యార్థుల వివరాలను నమోదు చేయడానికి అవకాశముంటుందని ఉపాధ్యాయులు అభిప్రాయపడుతున్నారు.

వికారాబాద్ జిల్లాలో ఒక్కో ఎంఆర్‌సీ కార్యాలయంలో ఒక ఎంఐసీ కోఆర్డినేటర్, నాలుగు నుంచి ఆరుగురు వరకు క్లస్టర్ రిసోర్స్ పర్సన్లు(సీఆర్‌పీలు) ఉన్నారు. ఆయా క్లస్టర్ల పరిధిలోని పాఠశాలలకు సంబంధించిన సమాచారాన్ని సేకరించి ఎంఆర్‌సీ కార్యాలయంలోని కంప్యూటర్లలో నమోదు చేస్తున్నారు. గతంలో ఒకటే కంప్యూటర్ ఉన్నపుడు డాటా ఎంట్రీకి ఇబ్బందులు ఎదురయ్యేవి. ప్రస్తుతం ఆరు కంప్యూటర్లు రావడం వల్ల డాటా ఎంట్రీకి, ఆన్‌లైన్ విద్యాశాఖకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి సులభమైందని ఉపాధ్యాయులు అభిప్రాయపడుతున్నారు. వికారాబాద్ జిల్లాలోని అన్ని ఎంఆర్‌సీ కార్యాలయాల్లో కంప్యూటర్లను బిగించారు.

### అన్ని ఎంఆర్‌సీలలో ఏర్పాటు చేశాం




వికారాబాద్ జిల్లాలోని 19 ఎంఆర్‌సీ కార్యాలయాలకు ఆరేసి చొప్పున కంప్యూటర్లను సరఫరా చేసి వాటిని ఏర్పాటు చేశాం. కంప్యూటర్ల ఏర్పాటు వల్ల పాఠశాలలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని వాటిలో నమోదు చేయడానికి అవకాశం కలుగుతుంది. ఎంఐఎస్ కోఆర్డినేటర్లతో పాటు సీఆర్‌పీలు కూడా వీటిని ఉపయోగించి డాటాను అవసరమైన సమాచారం నమోదు చేయడానికి అవకాశం ఉంది.

**- రేణుకాదేవి, డీఈవో వికారాబాద్**

# 23 ప్రశ్నలతో రెడీ

- నేడు మేయర్ అధ్యక్షతన బల్దియా సర్వసభ్య సమావేశం
- ప్రజా సమస్యలు, అధికారుల అక్రమాలు, అవినీతిపై గళమెత్తనున్న సభ్యులు



సిటీబ్యూరో, ఫిబ్రవరి 18 (నమస్తే తెలంగాణ) : ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న జీహెచ్‌ఎంసీ సర్వసభ్య సమావేశం సోమవారం ఉదయం 10 గంటలకు జరగనున్నది. జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన జరిగే ఈ కౌన్సిల్ సమావేశంలో అన్ని పార్టీలకు చెందిన 147 మంది కార్పొరేటర్లతో పాటు ఎక్స్ అఫిషియో సభ్యులు పాల్గొని ప్రజా సమస్యలపై గళం విప్పనున్నారు. డిసెంబర్ మొద టి వారం తర్వాత జరగాల్సిన కౌన్సిల్ సమావేశం కమిషనర్ రోనాల్డ్ రాస్ వైఖరితో జాప్యం జరిగింది. చివరకు మేయర్ కౌన్సిల్ సమావేశ ఏర్పాటుపై సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి ఫిర్యాదు చేయ డం..బీజేపీ కార్పొరేటర్ శ్రవణ్ న్యాయస్థానాన్ని ఆశ్రయించడం వంటి చర్యలతో వెనువెంటనే కౌన్సిల్ ఏర్పాటుకు అడుగులు పడ్డాయి. మొత్తం గా గడిచిన ఐదు నెలలుగా అభివృద్ధి పనులు ఆటకెక్కడం, కొత్త ప్రాజెక్టులు లేకపోవడం, అపరిష్కృత సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతుండడంతో కార్పొరేటర్లు కౌన్సిల్ సమావేశం వైపు ఎదురుచూసిన పరిస్థితి. నేటి కౌన్సిల్ సమావేశం వాడీవాడీగా జరిగే అవకాశాలు ఉన్నాయి.

### ప్రశ్నలు సంధించేందుకు సిద్ధం

జీహెచ్‌ఎంసీలో బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు 54, ఎంఐఎం 42, బీజేపీ 40, కాంగ్రెస్ 11 (మూడు డివిజన్లలో ఉప ఎన్నికలు జరగాల్సి ఉంది) మంది ఉండగా...అన్ని పార్టీలకు కౌన్సిల్ సమావేశంలో మాట్లాడేందుకు అవకాశం కల్పించారు. 11 మంది సభ్యులున్న అధికార పార్టీ కాంగ్రెస్ కార్పొరేటర్లతో పాటు ప్రతిపక్షంలో ఉన్న బీఆర్‌ఎస్, బీజేపీ, ఎంఐఎం పార్టీ కార్పొరేటర్లకు ప్రజల సమస్యలపై మాట్లాడనున్నారు. 23 ప్రశ్నలతో సభ్యులు సుదీర్ఘంగా చర్చించనున్నారు. ప్రధానంగా శానిటేషన్, రాంకీ నిర్వహణ, వైద్య ఆరోగ్య శాఖలో జరుగుతున్న అక్రమాలు, జీహెచ్‌ఎంసీకి భారంగా మారుతున్న డిప్యూటేషన్లు, స్వీపింగ్ యంత్రాల్లో జరుగుతున్న అవినీతి, ప్రకటనల విభాగంలో, సీఆర్‌ఎంపీ రోడ్ల నిర్వహణ, ట్యాక్స్ (రెవెన్యూ)లో, టౌన్‌ప్లానింగ్, నాలాల అక్రమణలపై అధికారుల లోపాలను ఎత్తి చూపనున్నారు. అయితే సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు అధికారులు ఏ మేరకు సమాధానం చెబుతారో అన్నది ఆసక్తికరంగా మారింది. సమావేశం సాయంత్రం వరకు జరిగే అవకాశం ఉండగా..చివరలో బడ్జెట్‌పై సుదీర్ఘంగా చర్చించి ఆమోదించనున్నారు. కాగా, కౌన్సిల్‌లో సభ్యులు కూర్చునే సీటింగ్ కేటాయింపులో కొన్ని మార్పులు చేశారు. అధికార పార్టీ కాంగ్రెస్ సభ్యులకు ప్రాముఖ్యత ఇచ్చారు. ఇది వరకు ముగ్గురు సభ్యులు మాత్రమే ఆ పార్టీకి ఉండగా..తాజాగా చేరికలతో 11 మంది వరకు కాంగ్రెస్ కార్పొరేటర్లు చేరారు. దీంతో కాంగ్రెస్ సభ్యుల విజ్ఞప్తి మేరకు ఈ మార్పులు చేశారు.

# ఆలస్యంతో ఆగమాగం


- మొయినాబాద్ మండలంలో సీజన్ ముగింపు దశలోనూ వరి సాగు
- పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- కాలం కలిసొస్తేనే చేతికి పంట
- దేవుడిపై భారం వేసి సాగు
- గతేడాది కంటే తగ్గిన సాగు విస్తీర్ణం
- భూగర్భ జలాలు తగ్గుముఖం
- వర్షాలు గతేడాది కంటే తక్కువే

మొయినాబాద్ మండలంలో యాసంగి పంటల సాగు కాలం ముగింపు దశకు వచ్చింది. జనవరి రెండో వారానికి వరి నాట్లు పూర్తి కావాల్సి ఉన్నది. కలుపు తీసి ఎరువులు వేసుకునే సమయంలోనూ రైతులు ఇంకా నాట్లు వేస్తున్నారు. యాసంగి సీజన్ నవంబర్ నుంచి ప్రారంభం కావాల్సి ఉండగా జనవరి నెల నుంచి నాట్లు వేసుకుంటున్నారు. ముదిరిన వరి నారు, వాతావరణంలో వచ్చిన మార్పులతో ఆలస్యంగా నాట్లు వేస్తే దిగుబడిపై ప్రభావం చూపుతుందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. వారం రోజులుగా ఎండలు మండిపోతుండటం, వాతావరణ మార్పులతో చీడపీడల వ్యాప్తి పెరుగుతుందని పంట చేతికొచ్చే సమయంలో ఆకాల వర్షాలు దెబ్బతీసే అవకాశం కూడా ఉండవచ్చని అధికారులు పేర్కొంటున్నారు. ఏప్రిల్, మే నెలలో ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం కూడా ఉండవచ్చని అధికారులు చెబుతున్నారు.

- మొయినాబాద్, ఫిబ్రవరి 18



తోలుకట్టాలో ట్రాక్టర్‌తో కరిగటి చేస్తున్న రైతు



నక్కలపల్లిలో వేసిన వరి నాట్లు

### ఈ ఏడాది సన్నరకం 80 శాతం సాగు

వరి సాగు కంటే స్వల్పకాలిక పంటలు సాగు చేసుకుందామని కొంత మంది రైతులు వరి నాట్లు వేయడానికి ఆసక్తి చూపడంలేదు. బియ్యం ధరలు విపరీతంగా మార్కెట్‌లో పెరగడంతో వరి సాగు చేసుకుంటేనే అధిక ఆదాయం పొందవచ్చని కొంత మంది రైతులు ధైర్యం చేసి వరి నాట్లు ఇప్పటికీ వేస్తున్నారు. మంచు కారణంగా నారు మడుల్లో నారు దెబ్బతినడంతో మళ్లీ నారు పోసి వరి నారు చేతికి రావడం ఆలస్యం కావడంతో వరి నాట్లు వేయడానికి అదనపు సమయం కేటాయించడం జరిగింది. ఆలస్యమైనా దేవుడిపై భారం వేసి వరినాట్లు వేస్తున్నామని కొంత మంది రైతులు చెబుతున్నారు. యాసంగిలో ప్రధాన పంటగా వరి సాగు మాత్రమే ఉంటుంది. వానకాలంలో సన్న రకం వరి సాగు వేసే రైతులు యాసంగిలో దొడ్డు రకం వరి సాగు చేస్తున్నారు. ఈ ఏడాది సన్నరకం బియ్యానికి మార్కెట్లో మంచి డిమాండ్ ఉండడంతో రైతులు సన్నరకం వేయడానికి ఆసక్తి చూపుతున్నారు. గత ఏడాది మండలంలో 70 శాతం దొడ్డు రకం సాగు చేయగా 30 శాతం సన్న రకం వరి సాగు చేశారు. ఈ ఏడాది మాత్రం 80 శాతం సన్నరకం 20 శాతం మాత్రమే దొడ్డు రకం వరి సాగు చేశారని వ్యవసాయ అధికారుల చెక్కలు చెబుతున్నాయి.



సురంగల్‌లో వరి నాట్లు వేయడానికి కరిగటి చేసి సిద్ధంగా చేసిన రైతు

### 2200 ఎకరాల్లో మాత్రమే వరి సాగు

గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది యాసంగిలో తక్కువ విస్తీర్ణంలో వరి సాగు చేశారు. ఈ ఏడాది వర్షాలు తక్కువగా కురువడం, ఎండలు కూడా ఫిబ్రవరి మాసంలోనే అధికంగా ఉండటం, భూగర్భ జలాలు కూడా తగ్గుముఖం పట్టడంతో వరి సాగు చేస్తే కొంత నష్టం కూడా జరగవచ్చనే భావనతో కొంత మంది రైతులు వరి సాగు చేయకుండా సల్పకాలిక పంటల సాగుపై దృష్టి పెట్టారు. మండలంలో యాసంగిలో సాధారణ వరి సాగు విస్తీర్ణం 1352 ఎకరాలుంటే సాధారణ సాగు కంటే ఎక్కువగా వరి సాగు చేస్తున్నారు. గతేడాది 3503 ఎకరాల్లో వరి సాగు చేస్తే ఈ ఏడాది 2200 ఎకరాల్లో మాత్రమే సాగు చేశారు.

### తగ్గిన సాగు విస్తీర్ణం 1303 ఎకరాలు

వరి నారు పోసి మొలకలు ఎత్తిన సమయంలో అధికంగా మంచు కురువడంతో వరి నారు పూర్తిగా దెబ్బతిన్నది. మళ్లీ వరి నారు పోసి నాట్లు వేసే సరికి ఆలస్యం అవుతుందని పంట చేతికి వచ్చే సమయంలో అకాల వర్షాలు దెబ్బతిస్తాయని భావన కూడా కొంత మంది రైతుల్లో ఉంది. వర్షాకాలంలో కూడా తక్కువ వర్షాలు కురువడంతో భూగర్భ జలాలు కూడా అంతంత మాత్రంగానే ఉన్నాయి. ప్రభుత్వం మారడంతో కరెంట్ పాలసీలు ఏ విధంగా ఉంటాయోనన్న ఆందోళన కూడా రైతుల్లో ఉన్నది. ఈ నేపథ్యంలో ఈసారి యాసంగిలో తక్కువ శాతం వరినాట్లు పడ్డాయి. గత ఏడాది కంటే మండలంలో 1303 ఎకరాల సాగు విస్తీర్ణం తగ్గింది. ఈ ప్రాంతంలో కేవలం బోరుబావులు, విద్యుత్‌పై ఆధారపడి వరి పంటల సాగు ఉండటంతో తక్కువ విస్తీర్ణంలో వరి సాగు ఉంటుంది.

### దిగుబడిపై దిగులు

స్వల్పకాలిక వరి విత్తనం పంట దిగుబడి రావడానికి 90 నుంచి 100 రోజుల సమయం పడుతుంది. నవంబర్‌లో నారు పోసుకుని డిసెంబర్ నెలాఖరు వరకు నాట్లు వేసుకుంటే మార్చి వరకు పంట చేతికి వస్తుంది. ఈ సమయంలో ఆశించిన దిగుబడి వచ్చే అవకాశం ఉంటుంది. సన్న రకం దీర్ఘకాలిక పంట. 120 నుంచి 140 రోజుల్లో దిగుబడి వస్తుంది. ఆలస్యంగా ముదిరిన నారు వేయడం వలన చీడపీడల ఉధృతి ఎక్కువగా ఉంటుంది. ఏప్రిల్, మే నెలలో పెను తుఫాన్‌లు, ఈదురుగాలులు, అకాల భారీ వర్షాలతో పంటలు దెబ్బతినే ప్రమాదం ఉన్నది. దీంతో ఆలస్యంగా నాట్లు వేసుకుంటున్న రైతులు ఆశించిన మేర దిగుబడి వస్తుందో లేదోనని ఆందోళన చెందుతున్నారు.



చిన్నమంగళారంలో వరి నాట్లు వేస్తున్న కూలీలు

### సన్నరకంపై ఆసక్తి..

రైతులు గతేడాది కంటే ఈ ఏడాది సన్నరకంపై ఆసక్తి పెంచుకున్నారు. సన్న రకానికి మార్కెట్లో ధరలు విపరీతంగా పెరగడంతో పాటు డిమాండ్ కూడా ఎక్కువగా ఉన్నది. గతేడాది ఆంధ్రలో అధిక వర్షాలు కురువడంతో వరి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో ఆంధ్రలో బియ్యం కొరత ఏర్పడింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆ సమయంలో రాష్ట్రంలో సాగు చేసిన వడ్లు ఆంధ్రకు సరఫరా చేసింది. వడ్లకు మంచి డిమాండ్ ఉండటంతో గతేడాది రైతులు సాగు చేసిన వడ్లు పూర్తిగా విక్రయించారు. తెలంగాణ రాష్ట్రంలోని రైతుల వద్ద సన్నరకం బియ్యం లేకపోవడంతో.. ప్రస్తుతం తమ ఇంటి అవసరాలకు సన్నరకం బియ్యం కావాల్సి ఉండటంతో రైతులు సన్నరకం బియ్యం సాగు చేయడానికి ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. అందుకే దొడ్డు రకం బియ్యం కంటే సన్న రకం వరి సాగు చేస్తున్నారు.

### కూలీల కొరత

మొయినాబాద్ మండలం నగరానికి అతి చేరువలో ఉండడంతో కూలీల కొరత రైతులను తీవ్రంగా వేధిస్తున్నది. ఎక్కువ కూలీ డబ్బులు ఇస్తామన్నా కూలీలు మాత్రం రావడంలేదు. నగరానికి వెళ్లి ఏదో ఒక పనిచేసుకుంటున్నారు. గచ్చిబౌలి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ చాలా దగ్గరగా ఉండటం, హైదరాబాద్ మహా నగరం చాలా దగ్గరగా ఉండటం, నీడపాటు ఉద్యోగాలకు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. తక్కువ వేతనాలు ఇచ్చే హౌస్‌కీపింగ్ పనులైనా ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. అదే విధంగా ఈ ప్రాంతంలో ఉన్న నిరుద్యోగులు ఎంతో కొంత రియల్ వ్యాపారం చేయడంతో ఆర్థికంగా బలపడం, కొందరు భూములను అమ్ముకుని వడ్డీలకు డబ్బులు ఇచ్చుకోవడం, ఇండ్ల నిర్మాణం చేపట్టి అద్దెకు ఇవ్వడంతో ఆర్థికంగా స్థిరపడటంతో ఈ ప్రాంతంలో కూలీల కొరత ఎక్కువగా ఉన్నది. కూలీల కొరతతో పాటు ఉన్న కొద్దిమంది రైతులు కూడా పంటలు సాగు చేయడానికి పెద్దగా ఆసక్తి చూపడంలేదు. వ్యవసాయమే ఫ్యాషన్‌గా చేసే రైతులు ఇంట్లో ఉన్నవారితో పంటలు సాగు చేసుకోవడం లేదా అడ్డా మీద ఉండే లేబర్‌ను తీసుకొచ్చి పంటలు సాగు చేసుకుంటున్నారు. వరి నాట్లు చేయడానికి వలస కూలీలను తీసుకొచ్చి నాట్లు వేయించుకుంటున్నారు. పాత మహబూబ్‌నగర్ జిల్లాలోని కొడంగల్, నారాయణపేట్, కోస్గి ప్రాంతాలకు చెందిన వలస కూలీలతో రైతులు వరి నాట్లు వేసుకుంటున్నారు.

### దేవుడిపై భారం వేసి నారు వేస్తున్నాం



దేవుడిపై భారం వేసి నారు వేస్తున్నాం. ముందు నారు పోసాను. కాని మంచు బాగా కురిసింది. దీంతో నారు పూర్తిగా పాడైంది. మళ్లీ నారు పోసి నారు వేయడానికి సిద్ధమైన తరువాత కరిగట్టు చేస్తున్నాను. బోరులో నీరు తగ్గుతున్నది. కనీసం ఇంటికి సరిపడా బియ్యం వస్తాయని నారు వేస్తున్నా. పంట చేతికొస్తే అదృష్టం లేదా దురదృష్టం. నారు వేయడానికి నెల రోజులు ఆలస్యమైంది.

**- యాదయ్య, రైతు, తోలుకట్టా, మొయినాబాద్**

### ఏప్రిల్ వరకు పంట చేతికి రావాలి



యాసంగి కాలం అక్టోబర్-5 నుంచి మార్చి లేదా ఏప్రిల్ వరకు ఉంటుంది. వరి నాట్లు వేయడం సాధారణంగా అక్టోబర్-5 నుంచి డిసెంబర్ 31 లేదా జనవరి 15 వరకు పూర్తి కావాలి. వరి కోతలు మార్చి, ఏప్రిల్ వరకు పూర్తవ్వాలి. ఆలస్యమైతే అకాల వర్షాలతో చేతికి వచ్చే పంటలు దెబ్బతినే అవకాశం ఉంటుంది. రైతులు పోసిన నారు మంచుకు దెబ్బతిన్నది. మళ్లీ రైతులు నారు పోసి నాట్లు వేయడం ఆలస్యం అయ్యింది. ఈ నెలాఖరు వరకు వరి నాట్లు వేస్తారు. సన్నరకం వరి కాబట్టి ఇప్పుడు నాట్లు వేస్తే పంట మే వరకు చేతికి వచ్చే అవకాశం ఉంటుంది. మే నెలలో అకాల వర్షాలు పడకపోతే రైతులు బయటపడే అవకాశం ఉంటుంది.

**- రాగమ్మ, మండల ఏవో, మొయినాబాద్**